ప్రజాశక్తి

సోమవారం 18 డిసెంబర్ 2023

I

అల్లూరి సీతారామరాజు



సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-పాడేరు: ఈ నెల 21న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చింతపల్లి పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, ముఖ్యమంత్రి భద్రతకు ఆటంకం లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హెలిపాడ్ నిర్మాణం, వేదిక వద్ద బారికేడ్ల ఏర్పాటు పనులు పరిశీలించారు. సంబంధిత అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. సమయం తక్కువగా ఉన్నందున పనులు వేగవంతంగా చేయాలని ఆదేశించారు.


పరిశీలిస్తున్న కలెక్టర్

అంగన్వాడీలకు మద్దతుగా..

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల నిరసనలు


అరకులో అంగన్‌వాడీలతో కలిసి నినాదాలు చేస్తున్న గర్భిణులు, బాలింతలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం ఆరవ రోజుకు చేరింది. అంగన్వాడి కేంద్రం పరిధిలో ఉన్న బాలింతలు, గర్భిణీలు, పిల్లలు సమ్మె వద్ద వచ్చి అంగన్వాడీలు చేపడుతున్న సమ్మెను మద్దతు తెలిపారు.అనంతరం రోడ్డు ప్రమాదాదంలో మృతి చెందిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటానికి అంగన్వాడిలు, నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంగన్వాడి నాయకులు మాట్లాడుతూ, ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ఉద్యోగుల కోసం అనేక పోరాటాలు చేశారని, అలాంటి నాయకులు మన మధ్య లేకపోవడం ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో అంగన్వాడీల సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుతామన్నారు. ఆరు రోజులుగా అంగన్వాడిలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్టు కూడా లేదని విమర్శించారు. ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి తెలంగాణ ప్రభుత్వం కంటే అదనంగా జీతాలు పెంచుతామని మాయమాటలు చెప్పి తీరా అధికారంలో వచ్చాక మాట మార్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.నాగమ్మ, ప్రాజెక్టు కమిటీ నాయకులు పాంగి వెంకటలక్ష్మి, లక్ష్మి, నిర్మల, జానకి, భవాని, సీత, గౌరమ్మ, వంజన పాల్గొన్నారు.

అనంతగిరి: సమస్యలు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని చేపట్టిన అంగన్వాడిల సమ్మె కొనగింది. అంగన్వాడీ కేంద్రాలు తెరిచేందుకు ప్రభుత్వం


పెదబయలులో మాట్లాడుతున్న సన్నిబాబు

ఆరో రోజుకు చేరిన సమ్మె

ప్రత్యామ్నాయం తీసుకున్నప్పటికీ అంగన్వాడిలు ఒడిదుడుకులకు లోనవ్వ లేదు. గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులతో కలిసి సమ్మె కొనసాగించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ మండల యూనియన్ నాయకురాలు సిహెచ్ కళావతి. పి,మంజుల, కుమారి, చిలకమ్మ, కార్యకర్తలు, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు

పెదబయలు: అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బోండా సన్నిబాబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్ల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయకుండా అంగన్వాడి సెంటర్లను సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, అధికారులతో తెరిచేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే రాబోయే కాలంలో జరిగే ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవి చూడాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మానపడాల్, సిఐటియు పూర్వ మండల కార్యదర్శి, బొండా గంగాధరం, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు టి రాజమ్మ, ఎస్.సుశీల, మంగమ్మ, శాంతి, కొండమ్మ, కుర్ర దేవి, పార్వతి, వరహాలమ్మ పాల్గొన్నారు.


అనంతగిరిలో ....

చింతూరు: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె ఆరో రోజూ కొనసాగింది. అంగన్వాడీల ఆందోళనకు సంఘీభావంగా చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, మహిళలు ఆదివారం మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల వద్ద నిరసనలు తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారంతా డిమాండ్ చేశారు.

కూనవరం : మండలంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల్లో పిల్లలు, తల్లులు అంగన్వాడీ కేంద్రాలకు వచ్చి అంగన్వాడీలు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : అంగన్వాడీలు చేస్తున్న సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ఐక్యంగా తిప్పి కొట్టాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, లోదొడ్డి సర్పంచ్ లోతా రామారావు పిలుపునిచ్చారు, మండలంలోని లోదొడ్డి పంచాయతీ పరిధిలోని లోదొడ్డి, పూదేడు, కేశవరం, పాకవెల్లి గ్రామాల్లో అంగన్వాడీలకు మద్దతుగా చిన్నారులు, మహిళలు ఆందోళనలు చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ అంగన్వాడీల డిమాండ్లను పరిష్కరించాలని, కేంద్రాలకు నాణ్యమైన సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు జర్త రాజుబాబు, వి సత్యనారాయణ, మురళి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం : అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు ఆదివారం తమ


చింతూరులో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీల, లబ్ధిదారులు

తమ గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల వద్ద లబ్ధి పొందుతున్న చిన్నపిల్లల తల్లులు, గర్భిణులు, బాలింతలకు తాము చేపట్టిన సమ్మె ఉద్దేశాన్ని వివరించారు. తమ సమ్మెకు మద్దతు తెలపాలని కోరారు. దీంతో వారంతా ఆయా కేంద్రాల వద్ద నిరసనలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి కె.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


విఆర్.పురం : మండల కేంద్రంలో రేఖపల్లి జంక్షన్‌లో అంగన్వాడీలు చేపట్టిన ఆందోళన 6వ రోజుకు చేసింది. ఈ ధర్నా శిబిరాన్ని సందర్శించిన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కారం చేయకుండా, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, వెలుగు, సిడిపివోల చేత గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల తాళలు బద్దలుకొట్టడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే రాబోయే కాలంలో జరిగే ఎన్నికల్లో ఘోర పరజయానికి చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు నాగమణి, కార్యదర్శి రాజేశ్వరి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనం సత్యనారాయణ, అధిక సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.


రాజ ఒమ్మంగిలో మాట్లాడుతున్న లోతా రామారావు

గిరిజన రైతులకు సాగునీటి సదుపాయం

- ప్రజాశక్తితో స్పెషల్ మైనర్ ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రమేష్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలోని 11 మండలాల పరిధిలో గిరిజన రైతులకు సాగునీటి సదుపాయం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని స్పెషల్ మైనర్ ఇరిగేషన్ (ఎస్ఎంఐ) పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రమేష్ వెల్లడించారు. అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఏజెన్సీలో సాగునీటి అభివృద్ధికి అధిక ప్రాధాన్యత నిస్తున్నారని, 60 సాగునీటి పథకాల పనులు మంజూరు చేశారని తెలిపారు. ఈ మేరకు ఏజెన్సీలో సాగనీటి కల్పనకు చేపడుతున్న అభివృద్ధి పనులపై ఆయన మాటల్లోనే...





సాగునీటి పథకాల అభివృద్ధికి చర్యలేమిటి?

ఎంజిఎన్ఆర్ఇజిఎస్ కింద చెక్ డ్యాములు, కాలువల మరమ్మతులు వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నాం. 60 సాగునీటి పనులు మంజూరయ్యాయి. వీటిలో పది ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. పాడేరు మండలంలో 8 లక్షలతోనూ, అనంతగిరి మండలంలో 15 లక్షలతో 2 సాగునీటి పనులు ఇప్పటికే పూర్తి చేసాం. ఆరు కోట్ల 87 లక్షల వ్యయంతో ఈ సాగునీటి పథకాల పునరుద్ధరణ పనులు చేపట్టాం. మార్చి నాటికి ఈ పనులన్నీ పూర్తవుతాయి....

కొత్త చెక్ డ్యాములకు ప్రతిపాదన?

పాడేరు డివిజన్లోని అరకు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో అరకు శాసనసభ్యులు ఇచ్చిన రిప్రెజెంటేషన్ పై సర్వే చేసి కొత్తగా 70 చెక్ డాంల నిర్మాణం చేపట్టడం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసాం. ప్రభుత్వం ఆమోదించి నిధులు మంజూరు చేయగానే వీటి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

సాగునీటి ప్రాజెక్టులకు ప్రతిపాదనలు

ఏజెన్సీ వ్యాప్తంగా గిరిజన రైతులకు సాగునీటి సదుపాయం మెరుగు పరిచేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం. గ్రామాలలో రైతుల నుంచి సాగునీటి పథకాల పునరుద్ధరణ కోసం ఎక్కువగా వినతులు వస్తున్నాయి. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా కూడా వచ్చిన వినతులపై 50 సాగునీటి పనులకు ప్రతిపాదనలు చేశాం. వచ్చే ఖరీఫ్ నాటికి గిరిజన రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసాం.


శారద చిత్రపటానికి పూలమాలలు చేస్తున్న పాఠశాల కమిటీ సభ్యులు, సిబ్బంది

ఘనంగా శారద వర్ధంతి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకువేలి శారద నికేతన్ పాఠశాలలో ఆదివారం డి.శారద వర్ధంతి ఘనంగా నిర్వహించారు. పాఠశాల కమిటీ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్ చిరంజీవులు, సిబ్బంది శారదా చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాల కమిటి సభ్యులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన బిడ్డలకు ఇంగ్లీష్ మీడియం చదువు అందించాలనే ఉద్దేశంతో శారదా కలల మేరకు శారదా ట్రస్ట్ పేరుతో పాఠశాల స్థాపించడం విశేషమన్నారు. కష్టజీవులు, మహిళల హక్కుల కోసం సుదీర్ఘమైన పోరాటం నిర్వహించారని చెప్పారు. ఏజెన్సీలో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించి మందులు పంపిణీ చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జెడ్‌పి హైస్కూల్ స్వర్ణోత్సవాలు


పాఠశాల ఆవరణలో అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవాలు (50 ఏళ్ల పండగ) శని, ఆదివారాల్లో ఘనంగా జరిగాయి. ఈ పాఠశాల 1963లో ఏర్పాటు కాగా, నాటి నుండి 2023 వరకు ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన సుమారు 55 బ్యాచ్‌లకు చెందిన 3 వేలకు మందికి పైగా పూర్వ విద్యార్థులు రెండు రోజులపాటు జరిగిన ఈ స్వర్ణోత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని, అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ప్రేమానురాగాలు పంచుకున్నారు. శనివారం మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా పాఠశాల హెచ్‌ఎం గోపాలకృష్ణ జాతీయ జెండాను ఎగురవేశారు. పూర్వ విద్యార్థులు స్వర్ణోత్సవ కమిటీ కలిసి పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన 8 అడుగుల అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహాన్ని, పైలాన్‌ను ఆవిష్కరించారు. ఎక్కడెక్కడ నుండో సుదూర ప్రాంతాల నుండి వచ్చిన అతిథులకు షడ్రుచుల విందు ఏర్పాటు చేశారు. ఆదివారం బ్యాచీల వారీగా విద్యార్థులను పిలిచి మెమెంటోల్లను ప్రదానం చేశారు. తొలిత చదువు చెప్పిన గురువులను వేదికపైకి పిలిచి పాదాభివందనాలు చేసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. నాటి కిరోసిన్ దీపాల నుండి, నేటి డిజిటల్ తరగతుల వరకు విద్యా బోధన గూర్చి పలువురు మేధావులు వివరించారు. ఈ స్వర్ణోత్సవ వేడుకల్లో పూర్వ, ప్రస్తుత విద్యార్థులు ఆలపించిన గీతాలు, ప్రదర్శించిన కోలాటం, భరతనాట్యం, ఏకపాత్రాభినయాలు, నాటికలు, నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ రెండు రోజులు గ్రామంలో పండుగ వాతావరణం తలపించింది. ఈ కార్యక్రమంలో స్వర్ణోత్సవ కమిటీ సభ్యులు డి.శివాజీ రాజు, సిహెచ్ అప్పారావు, వాడ్రేవు సుందరరావు, కృష్ణవర్మ, విగ్నేశ్వరుడు, లక్ష్మణ్, పి.ప్రసాద్, ఇమ్మానుయేలు, టి.వీర్రాజు, నాగేంద్ర కుమార్, రాజ్ బుంగా, లూథర్ బాబు, శ్రీనివాస్ జీవన్, బద్రి భాస్కర్, బషీరా, సావిత్రి, లక్ష్మి, నేలవేణి, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు, అటవీశాఖ అధికారుల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

ప్రజాశక్తి-రంపచోడవరం

పోలీస్, అటవీ శాఖ అధికారుల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌ను స్థానిక ఏపీఆర్ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించారు. ఈ మ్యాచ్లో రంపచోడవరం ఎఎస్‌పి జగదీష్ అడహళ్లి, డిఎఫ్ఒ నరేంద్రియన్, రంపచోడవరం సిఐ వెంకటేశ్వరరావు, ఎస్సై మోహన్ కుమార్ తదితరులు క్రికెట్ ఆడారు. 15 ఓవర్ల మ్యాచ్లో మొదటగా బ్యాటింగ్ చేసిన పోలీస్ శాఖ 89 పరుగులు సాధించింది. తరువాత బ్యాటింగ్ చేసిన అటవీశాఖ అధికారులు నిర్ణీత ఓవర్లలో 90 పరుగుల విజయ లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో రేంజి అధికారి ఆజాద్, పోలీస్, అటవీ అధికారులు పాల్గొన్నారు.


బ్యాటింగ్ చేస్తున్న రంపచోడవరం ఎఎస్‌పి జగదీష్ అడహళ్లి


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యాన మండల కేంద్రంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు దాసరి ఉమామహేష్, రాయుడు శ్రీనివాస్, ఎస్.సంపత్ కుమార్ పాల్గొని సుమారు 100 మందికి వైద్య సేవలు అందించారు. 32 మందికి రక్త పరీక్షలు, ఏడుగురికి థైరాయిడ్ పరీక్షలు, ఏడుగురికి ఫిజియథెరపీ చేశారు. రోగులకు, సహాయకులకు మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద మహారాజ్ మాట్లాడుతూ రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో క్యాంప్ కో-ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, గాధిరాజు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న మైనింగ్ మాఫియా

- విదేశాలకు తరలిపోతున్న తెల్లరాయి
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం


తెల్లరాయి నిక్షేపాలు ఉన్న అటవీ ప్రాంతం ఇదే...

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు మన్యంలో మైనింగ్ మాఫియా రెచ్చిపోతుంది. ఎటువంటి అనుమతులు లేకుండానే తెల్ల క్వార్ట్జ్ (తెల్లరాయి) తవ్వకాలు చేస్తున్నారు. ప్రభుత్వానికి ఎలాంటి పన్నులు చెల్లించకుండానే కోట్ల విలువైన ఖనిజాన్ని సుదూర ప్రాంతాలకు తరలిస్తూ కోట్లు గడిస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికార యంత్రాంగం చోద్యం చూస్తుంది.

తెల్లరాయిని అద్దాలు తయారీ, ఖరీదైన మొబైల్ ఫోన్లో డిస్‌ప్లేలకు, పలు రకాల మందులు తయారీకి ఉపయోగిస్తుంటారు. అందువలన ఈ తెల్లరాయికి మంచి గిరాకీ ఉంది. తెల్లరాయి టన్ను దేశంలో సుమారు రూ.8000 ఉండగా, విదేశాల్లో టన్ను రూ.30వేలు పలుకుతోంది. దీంతో చింతూరు మండలంలోని గూడూరు, మధుగూరు, కుయుగూరు గ్రామాల పరిధిలోని అటవీ, అసైన్మెంట్, ప్రభుత్వ భూములలో ఉన్న తెల్లరాయి నిక్షేపాలపై అక్రమార్కుల కన్ను పడింది. పెద్ద పెద్ద తెల్లరాయి బండలను బద్దలు కొట్టేందుకు, శుద్ధి చేసేందుకు రాయలసీమ నుండి కూలీలను తీసుకుని వచ్చి ఇక్కడ పనులు శరవేగంగా చేయిస్తున్నారు. శుద్ధి చేసిన తెల్లరాయిని ఈ కూలీలతో లోడింగ్ కొన్ని గంటల వ్యవధిలోనే పూర్తి చేసి, రాత్రికి రాత్రి నెల్లూరు, చెన్నై, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. అక్కడ నుండి సముద్ర మార్గంలో చైనా, జపాన్, రష్యా, కొరియా, సింగపూర్, ఇండోనేషియా వంటి దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలుస్తుంది. చింతూరు ఏజెన్సీలో మైనింగ్ మాఫియా ఇంతగా రెచ్చిపోతున్నా అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం సత్వరమే స్పందించి మన్యంలో తెల్లరాయి తరలిస్తున్న అక్రమార్కులకు అడ్డుకట్ట వేసి, కేసులు నమోదు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయ పొలంలో పంటకోత ప్రయోగం



పంటకోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది,


వరి పనలతో ఆదర్శ రైతు కుంజా నాగిరెడ్డి

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలో అడవి వెంకన్న గూడెం గ్రామంలో ఆదర్శ రైతు కుంజా నాగిరెడ్డి ప్రకృతి వ్యవసాయం పద్ధతితో సాగు చేసిన వరి పొలంతో వ్యవసాయశాఖ అధికారులు ఆదివారం పంటకోత ప్రయోగం చేశారు. దిగుబడి - పెట్టుబడి - ఆదాయం లెక్కల అంచనా వేసి రైతుకు వివరించారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతు నాగిరెడ్డి మాట్లాడుతూ తను 2018 నుండి ప్రకృతి వ్యవసాయ విధానంలో బిపిటి 5204 వరి రకం సాగు చేస్తున్నట్లు చెప్పారు. భూమి ఆరోగ్యం - మన ఆరోగ్యం - మంచి దిగుబడి కొరకు ఈ పద్ధతి చాలా మంచిదని తెలిపారు. ఈ ప్రయోగం వలన తనకు ఎకరాకు 24 బస్తాలు దిగుబడి వచ్చిందని పేర్కొన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారి ఎన్.రఘుకుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని, అదరపు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని చెప్పారు. మిగిలిన రైతులు కూడా ఈ పద్ధతిని అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్‌డిఎస్, ఆర్‌బికె విఎఎ, ఓఎస్-ఎస్, ఆర్‌వైఎస్ఎస్, సిబ్బంది పాల్గొన్నారు.

భారీగా ట్రాఫిక్ జామ్



రోడ్డుపై గంటల తరబడి నిలిచిన వాహనాలు.

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:మండలంలోని పద్మావతీ గార్డెన్ సమీపాన చాక్లెట్ ఫ్యాక్టరీ రహదారిపై ఆదివారం భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు, పాదచారులు గంటలపాటు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గిరిజన మ్యూజియం, పద్మావతి గార్డెన్ గేటును మూసి కార్మికులు సమ్మె బాట పట్టడంతో పర్యాటకులు వెనుతిరిగారు. దీంతో చాక్లెట్ ఫ్యాక్టరీ వద్ద భారీగా రద్దీ పెరిగింది. పార్కింగ్ స్థలం లేక పోవడంతో వాహనాలు రోడ్డుపైనే పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య నెలకొందని స్థానికులు తెలిపారు.తక్షణమే చాక్లెట్ ఫ్యాక్టరీ యజమానులు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని మండి పడుతున్నారు. రహదారిపై ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.

మహారాజా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సేవలు

రాష్ట్రవ్యాప్తంగా విస్తృతం



మాట్లాడుతున్న వ్యవస్థాపక అధ్యక్షుడు రామకృష్ణంరాజు

ప్రజాశక్తి- సీతమ్మధార: రాష్ట్రంలో ఉత్తర కోస్తాలోని ఉమ్మడి ఆరు జిల్లాల్లోనే ఉన్న మహారాజా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని ప్రత్యేక మహాజన సభలో ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆదివారం సీతమ్మధార క్షత్రియ సంక్షేమ సమితిలో నిర్వహించిన బ్యాంకు మహాజన సభలో బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షులు ఎం. రామకృష్ణంరాజు మాట్లాడుతూ ప్రస్తుతం శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కష్ణ ఉమ్మడి జిల్లాల్లోనే అందుబాటులో ఉన్న బ్యాంకు సేవలను రాష్ట్రంలోని 26 జిల్లాలకు విస్తరించేలా బ్యాంకు మార్గదర్శకాలు(బైలా-3) సవరణ ప్రతిపాదనలకు మహాజనసభ ఏకగ్రీవంగా ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేశారు.

24ఏళ్ల క్రితం ద్వారకానగర్‌లో ప్రారంభించిన బ్యాంకును గాజువాక, బుచ్చిరాజుపాలెం, మధురవాడ, ఎంవిపి కాలనీ, సుజాతనగర్, కాకినాడ భానుగుడి జంక్షన్ ఇలా ఏడు శాఖలు, నాలుగు ఎటిఎంలు, 10 మంది బోర్డు ఆఫ్ డైరెక్టర్లు, ఆరుగురు బోర్డు ఆఫ్ మేనేజ్‌మెంట్ సభ్యులు, లీగల్ అడ్వైజర్లు, ఆడిట్ సలహాదారులు, 75 మంది సిబ్బందితో అభివృద్ధి పథంలో సాగుతోందన్నారు. 2017లో టైర్-2బ్యాంకుగా ఉన్న మహారాజా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో రూ.257.57 కోట్లు డిపాజిట్లు, రూ.176.61 కోట్లు రుణాలు కలిగి ఉన్నామన్నారు. వచ్చే ఫిబ్రవరి, మార్చిలో కూర్మన్నపాలెంలో నూతన శాఖను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు జి. బంగార్‌రాజు, ఎంవిఎస్‌జెడ్ ఎస్ఆర్‌కె.వర్మలను సత్కరించారు. బ్యాంకు జనరల్ మేనేజర్ ఎస్ఎస్. సత్యనారాయణ, 250మంది సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని

టూరిజం కార్మికుల మెరుపు సమ్మె



నిరసన చేపడుతున్న కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:అల్లూరి జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలోని పద్మాపురం గార్డెన్, గిరిజన మ్యూజియం, కొత్తవలస హెచ్ఎన్‌టిసి కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఐటీడీఏ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆదివారం గిరిజన మ్యూజియం, పద్మపురం గార్డెన్ గేటు ఎదుట కార్మికులు విధులు బహిష్కరించి ఒక్కరోజు మెరుపు సమ్మె నిర్వహించారు.ఈ సమ్మెకు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, పి బాలదేవ్ మాట్లాడుతూ, గత కొంతకాలంగా సమస్యల పరిష్కరించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, జిల్లా కలెక్టర్‌లకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. అధికారులకి ముందస్తు సమాచారం ఇచ్చి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐటిడిఏ పద్మాపురం గార్డెన్‌కు కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వలేదన్నారు. కనీస వేతనాలు రూ.26000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ పిఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించకపోవడం దుర్మార్గమని తెలిపారు. ఐటిడిఎ పరిధిలో పనిచేస్తున్న కార్మికులందరికీ కలెక్టర్ గెజిట్ జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.పద్మపురం గార్డెన్‌లో 2010, 2011 సంవత్సరంలో పిఎఫ్ పేరుతో కార్మిక వేతనాల్లో 12 శాతం కోత విధించి పిఎఫ్ ఆఫీస్ కి చెల్లించలేదని ఆ డబ్బులు ఏమయ్యాయో చెప్పలేదని తెలిపారు. తక్షణం ఆ డబ్బులు కార్మికుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. తక్షణం సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే నిరవదిక సమ్మెకు వెళ్లడానికి కార్మికులంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు దాడి రాజు, డొంబు, కమిటీ సభ్యులు రాంబాబు, బాబు, సునీల్ కుమార్, చిట్టి బాబు, సురేష్ కుమార్, తులసమ్మ తదితరులు పాల్గొన్నారు

ఎన్నాళ్లిలా డోలీ కష్టాలు..!

నిత్యం అవస్థలు పడుతున్న గిరిజనులు... పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి-అనంతగిరి :మారుమూల గిరిజన గ్రామాల గిరిజనులకు డోలి కష్టాలు తప్పలేదు. సరైన రోడ్డు సౌకర్యాలు లేక పోవడంతో వైద్య సేవలు అందక గిరిజన రోగులు మృత్యువాతకు గురవుతున్న ఘటనలు జరుగుతున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పిన్నకోట పంచాయతీ రాసకిలం గ్రామానికి చెందిన సూకురు బాబురావు గత కొన్ని రోజులుగా అనారోగ్య కారణంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు ప్రథమ చికిత్స నిమిత్తం దుప్పటి డోలి కట్టి గ్రామం నుండి ఏడు కిలోమీటర్లు కొండకోనల నడుమ నుండి పిన్నకోట ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు రిఫర్ చేశారు. అక్కడ నుండి అనకాపల్లి జిల్లా దేవరాపల్లి ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా పిన్నకోట ,పెద్దకోట, జీన్నబడు పంచాయతీ పరిధి మారుమూల గ్రామాలకు రోడ్డు లేక గిరిజనులు అనారోగ్యం పాలైనప్పుడు డోలీలోనే తరలించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు



బాబూరావును డోలీలో ఆసుపత్రికి మోసుకెళ్తున్న కుటుంబసభ్యులు

20న యువగళం సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -ఆనందపురం : టిడిపి, జనసేన బలోపేతం, రానున్న ఎన్నికలలో ఉమ్మడి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా రెండు పార్టీల శ్రేణులు సైనికుల్లా కష్టపడాలని జనసేన పార్టీ మండల అధ్యక్షులు తమ్మిన అప్పలరాజు పిలుపునిచ్చారు. ఆదివారం జనసేన పార్టీ రూరల్ కార్యాలయంలో జనసేన నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, ఈనెల 20న పోలిపల్లిలో యువగళం సభ విజయవంతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమం జనసేన మండల ప్రధాన కార్యదర్శి మూర్తి, ఉపాధ్యక్షులు తాడివాడ శివకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కృష్ణ, కార్యదర్శులు డాక్టర్ పిన్నింటి సన్యాసిరావు, నరసింగరావు, ఆల్తిరాజు, సురేష్, రాంపల్లి సురేష్, తోమురోతు. అప్పలరాజు పాల్గొన్నారు

వారపు సంత రద్దు

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లిలో నెల 20న బుధవారం జరగవలసిన వారపు సంత రద్దు చేస్తున్నట్టు చింతపల్లి సర్పంచ్ దురియా పుష్పలత ప్రకటించారు. వారపు సంత జరిగే సమీపంలోనే డిగ్రీ కళాశాల గ్రౌండ్లో గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బహిరంగ సభ సందర్భంగా వారపు సంతను రద్దు చేస్తున్నట్టు సర్పంచ్ తెలిపారు.

అంగన్వాడీ కార్యకర్త మృతి

ప్రజాశక్తి -అనంతగిరి:గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి అంగన్వాడి కార్యకర్త మృతి చెందింది. మండలంలోని అనంతగిరి పంచాయతీ పరిధి బారోజోల గ్రామంలో అంగన్వాడి కార్యకర్త ఎం, కళావతి (50) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎస్.కోట ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం అందించినప్పటికి పలితం లేక పోయిందని పేర్కొన్నారు.

ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, తాళ్ళవలసలో ఉన్న నారాయణ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి శని వారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం..

శ్రీకాకుళం జిల్లా, చౌడుపల్లి గ్రామానికి చెందిన అలుమూరి శశికిరణ్ (13), తాళ్లవలస నారాయణ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. అయితే శనివారం అతను ఉంటున్న హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ప్రిన్సిపల్, సిబ్బందితో కలిసి గదికి వెళ్లి చూడగా, ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉండడం చూసి, వెంటనే సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే విద్యార్థి మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలిసిహెచ్‌సికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.హరీష్ తెలిపారు.

వైద్యరంగంలో నిరంతర పరిశోధనలు అవసరం

ప్రజాశక్తి -తగరపువలస :వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని, పరిస్థితులకు అనుగుణంగా నిరంతరం పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని ప్రముఖ శస్త్రచికిత్స వైద్య నిపుణులు, పుస్తక రచయిత ప్రొఫెసర్ రాజగోపాల్ షెనాయ్ అభిప్రాయపడ్డారు. ఆదివారం స్థానిక సంగివలస ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో వైద్యరంగంలో వస్తున్న మార్పులపై నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ, వైద్యపరమైన అంశాలపై నిరంతరం అధ్యయనం అవసరమని వైద్య విద్యార్థులకు సూచించారు. సదస్సులో కళాశాల డీన్ డాక్టర్ పివి సుధాకర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి , ఎంబిబిఎస్ విద్యార్థులు పాల్గొన్నారు. సదస్సు ప్రారంభంలో ముఖ్య అతిథి రాజగోపాల్ షెనాయ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు

దసపల్లా హిల్స్‌లో వేలకోట్ల టిడిఆర్‌కు స్కెచ్

- జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్

ప్రజాశక్తి- సీతమ్మధార : దసపల్లా హిల్స్ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా రూ.రెండు వేల కోట్ల టిడిఆర్ కాజేసేందుకు వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి భారీ స్కెచ్ వేశారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. ఆదివారం పౌర గ్రంథాలయంలో మీడియాతో మాట్లాడుతూ దసపల్లా హిల్స్‌లో ప్రస్తుతమున్న 40 అడుగుల రోడ్డును వంద అడుగులకు విస్తరణ మాస్టర్‌ప్లాన్‌ను ఆర్‌డిపికి విరుద్ధంగా రూపొందించి, రూ. వెయ్యి కోట్ల పరిహారం టీడిఆర్ రూపంలో ఇవ్వటానికి పురపాలక పట్టణాభివద్ధి శాఖ అధికారులు సిద్ధమయ్యారన్నారు. సబ్ డివిజన్ చేసిన టౌన్ సర్వే రికార్డుల ప్రాతిపదికగా కాకుండా, పాత సర్వే నెంబర్లతో నోటిఫికేషన్ జారీలో కలెక్టర్ చొరవ నిబంధనలకు విరుద్ధమన్నారు. నగరంలో ప్రధానరోడ్ల విస్తరణకు ఇసుమంతైనా చర్యలు చేపట్టని జివిఎంసి కమిషనర్, ఏమాత్రం రద్దీలేని దసపల్లా హిల్స్ రోడ్డును రెండున్నర రెట్లు వెడల్పు విస్తరించడంలోనే అసలు కుట్రదాగి ఉందన్నారు. ఈ వ్యవహారంలో వైసిపి ముఖ్యనేతలు, ఐఎస్ఎస్, ఇతర అధికారుల ప్రమేయం, కుట్రపై సిఐడితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విశాఖను వీరి కబ్జా, కబంధ హస్తాల నుంచి కాపాడడానికి జనసేన ఉద్యమిస్తుందన్నారు. సమావేశంలో జనసేన అధికార ప్రతినిధి పోలిశెట్టి సత్యనారాయణ, మహిళా నాయకులు నాగ చౌదరి లక్ష్మి, త్రివేణి పాల్గొన్నారు



దుప్పట్లు అందుకున్న గిరిజనులు

గిరిజనులకు దోమతెరలు, దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి -రంపచోడవరం : రంపచోడవరం మండలం బందమామిడి గ్రామంలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 50 మంది గిరిజన కుటుంబాలకు రూ.25వేలు విలువ చేసే దుప్పట్లు, దోమతెరలు, మందులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాకినాడ లైన్స్‌క్లబ్ ఎలైట్ ప్రెసిడెంట్ ఎన్‌వివి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తమ క్లబ్ తరుపున సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలు వారి దృష్టికి తీసుకొచ్చారు. రంపచోడవరం -బంధమామిడి గ్రామాల మధ్య వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వానికి చాలా కాలంగా విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామం నుండి పిల్లలు పాఠశాలలకు వెళ్లాలన్నా, ప్రజలు ఆసుపత్రికి, ఇతర పనులు మీద రంపచోడవరం వెళ్లి రావాలన్నా వాగు కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. వర్షాలు పడి వాగు పొంగితే ప్రజలు ప్రమాదాలు బారిన పడుతున్నారన్నారు. ఎవరైనా సహాయం అందించి వంతెన నిర్మాణం చేస్తే తమ గ్రామానికి, ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ కాకినాడ కోశాధికారి పివి.రాఘవరావు, ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ, ఎమ్ఎస్ఆర్‌వి.సత్యనారాయణ, జోన్ ఛైర్‌పర్సన్ కటకం శ్రీనివాస్, ఎలైట్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రభుత్వ వసతి గృహాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు వారి తల్లిదండ్రుల ఆశయాలను, కలలను సాకారం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పిలుపునిచ్చారు. సుదూర ప్రాంతాల నుండి ఉన్నత విద్యను అభ్యసించడానికి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులకు ఉన్నత వసతి సదుపాయాలను అందించాలనే సంకల్పంతో జిల్లాలోని అన్ని వసతి గృహాలను అధునాతన రీతిలో తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. ఇసుక తోట వద్దగల ప్రభుత్వ వెనుకబడిన తరగతుల కళాశాల బాలికల వసతి గృహం పున్ణ నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఉదయం జరిగింది. జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం పోర్ట్ అథారిటీ అందించిన రూ.29 లక్షల సిఎస్ఆర్ నిధులతో ఈ వసతి గృహ పున్ణ నిర్మాణ పనులను చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటికే సిఎస్ఆర్ నిధులతో భీమిలి ప్రాంతంలోని వసతి గృహాలను కూడా ఆధునీకరించినట్టు తెలిపారు. ఇవేకాకుండా జిల్లాలో బిసి, ఎస్‌సి, గిరిజన సంక్షేమ వసతి గృహాలు చాలా ఉన్నాయని, వాటన్నింటినీ దశల వారీగా సిఎస్ఆర్ నిధులతో ఆధునీకరణ చేస్తామని తెలిపారు. నాడు - నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని వెల్లడించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలతో విద్యార్థులు నిరంతరం కష్టపడి ఉన్నత చదువులు అభ్యసించి, తల్లిదండ్రుల ఆశయాలను, కలలను సాకారం చేయాలని కోరారు. అనంతరం ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి కె.శ్రీదేవి, సమగ్ర శిక్ష ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ డివి.నర్సింహారావు, సహాయ బిసి సంక్షేమ అధికారులు ఎస్.వసంతకుమారి, బివి.రమణ, ఐ.జ్యోతీశ్రీ పాల్గొన్నారు.

మాజీ సైనికుల జాబ్ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ రీసెటిల్‌మెంట్, మాజీ సైనికుల సంక్షేమ శాఖ, రక్షణ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఆదివారం విశాఖపట్నంలోని ఐఎన్ఎస్ శాతవాహనలో మాజీ సైనికుల కోసం జాబ్ మేళాను నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుండి మాజీ సైనికులు తరలివచ్చారు. జాబ్ మేళాలో 30 కంపెనీలు పాల్గొన్నాయి. సైన్యం, వైమానిక దళం, నౌకాదళం నుంచి దాదాపు 1340 మంది మాజీ సైనికులు ఉపాధి కోసం నమోదు చేసుకున్నారు.

అభయహస్తం నిధులు దోచుకున్న జగన్

ఎల్‌జి పాలిమర్స్ బాధితులపై నిర్లక్ష్యమేలా..
యువగళం పాదయాత్రలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్
విశాఖ నగరంలోకి ప్రవేశం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి

అభయహస్తం నిధులను సిఎం జగన్ దోచుకున్నారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. అనకాపల్లి జిల్లాలో లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఆదివారానికి ఏడు రోజులు పూర్తి చేసుకుంది. అనంతరం విశాఖ నగరంలోకి ప్రవేశించింది. శనివారం రాత్రి ఆయన బసచేసిన తోటాడ నుంచి ఆదివారం ఉదయం పాదయాత్ర ప్రారంభించారు. పెందుర్తి నియోజకవర్గంలోకి ప్రవేశించిన లోకేష్‌కు మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. హారతి ఇస్తూ నీరాజనాలు పట్టారు. రోడ్డుకు ఇరువైపులా పార్టీ కార్యకర్తలు పూలు జల్లారు. పరవాడ మార్కెట్ సెంటర్‌లో ఎన్‌టిఆర్ విగ్రహాన్ని లోకేష్ ఆవిష్కరించారు. గొర్లెవానిపాలెం జిజె కాలేజీ వద్ద బోనంగి, లెమర్తి, తాడి, తానాం యువకులు ఆయనకు సంఘీభావం తెలిపారు.

యువగళం పాదయాత్ర సందర్భంగా లోకేష్‌కు పలువురు వేర్వేరు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. తోటాడ, సిరసపల్లి, వెంకటాపురం, పరవాడ మహిళలు, ఎల్‌జి పాలిమర్స్ బాధితులు, నిరుద్యోగులు వినతిపత్రాలు అందజేసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డికి అడ్డగోలు దోపిడీపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదని విమర్శించారు. పన్నులు పెంచి మౌలిక సదుపాయాలను గాలికొదిలేశారని అన్నారు. జగన్ పాలనలో అధ్వాన్నంగా తయారైన రోడ్లను పునరుద్ధరిస్తామన్నారు. అనకాపల్లి వయా తోటాడ, పరవాడ మీదుగా వెళ్లే రహదారిని విస్తరించి ప్రజల కష్టాలు తీరుస్తామన్నారు. ఎల్‌జి పాలిమర్స్ బాధిత గ్రామాలకు ఇచ్చిన హామీలను జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రభావిత గ్రామాల ప్రజలందరికీ హెల్త్ కార్డులిచ్చి వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పర్యావరణహిత, కాలుష్య రహిత పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. నాలుగున్నరేళ్లలో సగటున రోజుకు ఒక నిరుద్యోగి ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. మహిళలు దాచుకున్న రూ.2,500 కోట్ల అభయహస్తం డబ్బును జగన్ దోచుకున్నారని ఆరోపించారు. టిడిపి అధికారంలోకి రాగానే అభయహస్తం పథకాన్ని పునరుద్ధరిస్తామని, డ్వాక్రా గ్రూపులను బలోపేతం చేస్తామని అన్నారు. కాపు రిజర్వేషన్ల విషయంలో గతంలో అసెంబ్లీలో చేసిన తీర్మానానికి కట్టుబడి ఉన్నామన్నారు. కాపులకు గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. పరవాడ ఫార్మాసిటీ కారణంగా భూగర్భ జలాలు కలుషితం కాకుండా ట్రీట్మెంట్ ప్లాంటు ఏర్పాటు చేస్తామని అన్నారు.

నూతన విద్యా విధానంతో తీవ్ర నష్టం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్రం తీసుకొచ్చిన జాతీయ నూతన విద్యా విధానంతో తీవ్ర నష్టం జరుగుతుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్న కుమార్ అన్నారు. సంఘం విశాఖ జిల్లా 35వ మహాసభ ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. సభ ప్రారంభ సూచికగా స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో ఉన్న జెండాను ఆవిష్కరించారు. మహాసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రసన్న కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తు అంతా పోరాటాల కాలమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో తీసుకుంటున్న విధానాలు విద్యార్థులకు అన్యాయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం విద్యను కార్పొరేటీకరణ, వ్యాపారీకరణ దిశగా తీసుకెళ్తోందని అన్నారు. ఈ విద్యా విధానాన్ని ఎస్ఎఫ్ఐ వ్యతిరేకిస్తోందని తెలిపారు. కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియంత్రణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా విద్యార్థులను దోచుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చి నాలుగున్నర సంవత్సరాలు పూర్తయినా విద్యాలయాల్లో ఖాళీలను భర్తీ చేయకపోవడం దారుణమన్నారు.



మాట్లాడుతున్న ప్రసన్న కుమార్

నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా రాము, ఎల్‌జె.నాయుడు

ఈ మహాసభలో 23 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బి.రాము, ఎల్‌జె.నాయుడు ఎన్నికయ్యారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి సౌహార్ద్ర సందేశమిచ్చారు.

ప్రతిఘటనతోనే దళిత హక్కుల సాధన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రతిఘటనా ఉద్యమాలతోనే దళిత, బహుజన హక్కులను సాధించగలమని పలు దళిత, ప్రజాసంఘాల నేతలు పిలుపునిచ్చారు. డాబాగార్డెన్స్ ప్రేమ సమాజం హాల్‌లో దళిత విముక్తి 25 ఏళ్ల ప్రస్థానం సందర్భంగా ఆదివారం ప్రతిఘటనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్, పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పూర్వ ఐఎఎస్ అధికారి డాక్టర్ పిజె.సుధాకర్ మాట్లాడుతూ భారతదేశంలో కులమే అన్ని సమస్యలకు మూలంగా ఉందన్నారు.



విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న శోభన్‌బాబు అభిమానులు

శోభన్‌బాబు కాంస్య విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తెలుగు ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసి, కుటుంబ కథానాయకునిగా ప్రత్యేక గుర్తింపు పొందిన సినీ నటుడు శోభన్‌బాబు కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం డాబా గార్డెన్స్‌లోని విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌కు ఎదురుగా ఉన్న ప్రైవేటు స్థలంలో అట్టహాసంగా జరిగింది. తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన పలువురు శోభన్‌బాబు అభిమానుల నడుమ ఈ వేడుక సాగింది. విగ్రహ నిర్మాణ కమిటీ, విశాఖపట్నం శోభన్‌బాబు ఫ్యాన్స్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విగ్రహ స్థల దాత ఎ.సతీష్ కుమార్, విగ్రహ దాత జె.రామాంజనేయులు, రాశీ మూవీస్ అధినేత ఎం.నరసింహారావు, సింహచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు తదితరులు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత వీరంతా శోభన్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో విగ్రహ ఆవిష్కరణ చేసిన జె.రామాంజనేయులుతో పాటు పలువురు వక్తలు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న నటునిగా శోభన్‌బాబు ఎంతో గుర్తింపు పొందారన్నారు. ఆరు అడుగుల అందగానిగా, కుటుంబ చిత్రాల కథానాయకునిగా ఎన్నో సినిమాల్లో ఆయన తెలుగు ప్రేక్షకులను మెప్పించగలిగారన్నారు. శోభన్ బాబు సినిమాల్లో సమాజానికి అవసరమైన ఎంతో సందేశం ఉండేదన్నారు. నాటి తరంతో పాటు నేటి తరం హీరోలకూ శోభన్ బాబు ఆదర్శనీయంగా నిలిచారన్నారు. భౌతికంగా ఆయన లేకపోయినప్పటికీ తెలుగు ప్రజల గుండెల్లో ఎప్పుడూ ఆయన చిరస్మరణీయుడిగా ఉంటారన్నారు. ఈ సందర్భంగా దాతలను విగ్రహ నిర్మాణ కమిటీ ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో విగ్రహ నిర్మాణ, నిర్వహణ కమిటీ ప్రతినిధులు కోడూరు కనకరాజు, గువ్వల రమణ, త్రినాధ్, శోభన్‌బాబు, ఈశ్వరరావు, మువ్వల పోలారావు, దసపల్లా ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని ఒట్టిగడ్డ రిజర్వాయర్ సమీపంలో ఆదివారం బైక్ అదుపుతప్పి రహదారిపై పడిపోవడంతో యువతికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని అమ్మిరేకుల కొత్తవీధి గ్రామానికి చెందిన సుర్ల వరలక్ష్మి అనే యువతి కొత్తవీధి నుండి రాజవొమ్మంగి వస్తుండగా మార్గమధ్యంలో ఒట్టిగడ్డ రిజర్వాయర్ సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది. దీంతో యువతి మొహంపై కాళ్లు, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి, గ్రామస్తుల సమాచారంతో 108 వాహనంలో వరలక్ష్మిని రాజవొమ్మంగి పిహెచ్సి తరలించగా పిహెచ్సి వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స నిర్వహించారు.

990వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్ ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు ఆదివారానికి 990వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.తిరుపతిరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను భేషరతుగా విరమించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను కూడా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు నిర్ణయాలు చేసే విధంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దాంట్లో భాగంగా ఈ నెల 27వ తేదీ నాటికి దీక్షా శిబిరం ప్రారంభించి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా విశాఖపట్నంలోని రైల్వే డిఆర్ఎం ఆఫీసు నుండి ఆశీలు మెట్ట మీదుగా ప్రదర్శన చేపట్టనున్నట్టు తెలిపారు. అనంతరం సభ ఉంటుందన్నారు.వీటిలో కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. దీక్షల్లో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.మల్లయ్య, పి.లక్ష్మి పాల్గొన్నారు.